
సాక్షి పల్నాడు

శనివారం । 7 । డిసెంబర్ । 2024



పోస్టర్ ఆవిష్కరణ

నరసరావుపేట: స్థానిక కలెక్టరేట్‌లో బాల్య వివాహాల నిర్మూలన కోరుతూ రూపొందించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు శుక్రవారం ఆవిష్కరించారు.



సాగర్ నీటి మట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 585.90 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 8,221 క్యూసెక్కులు విడుదలవుతోంది.



వెండి బహూకరణ

పిడుగురాళ్ల: జానపాడు రోడ్డులో గల వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయానికి శుక్రవారం పట్టణానికి చెందిన పెరుమళ్ల రాజేష్, లక్ష్మీ వనజ దంపతులు 15 కేజీల వెండి అందించారు.

న్యూస్‌రీల్

సుబ్రహ్మణ్యేశ్వరుని సేవలో హైకోర్టు న్యాయమూర్తి



తెనాలి రూరల్: మండలంలోని పెదారావూరు గ్రామంలోని శ్రీ అభయ హస్త సుబ్రహ్మణ్యేశ్వ స్వామి ఆలయ నాలుగో వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. స్వామి వారిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాస్ ఉటుకూరు శుక్రవారం దర్శించుకున్నారు. తొలుత ఆలయ నిర్వాహకులు న్యాయమూర్తికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డాక్టర్ చింతలపాటి పూర్ణానంద శాస్త్రిని న్యాయమూర్తి, దేవస్థాన నిర్వాహకులు సత్కరించారు. ఉత్సవాల్లో భాగంగా శ్రీసుబ్రహ్మణ్య వాక్యార్థ సభ నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు చండీ హోమం, సువాసినీ పూజ చేపట్టారు.

శివాలయంలో హుండీ కానుకలు లెక్కింపు



పెదకాకాని: శివాలయంలో మల్లేశ్వరస్వామి ఆలయానికి ఆదాయం గణనీయంగా పెరిగినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కేబీ శ్రీనివాస్ తెలిపారు. పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో శుక్రవారం హుండీల కానుకలు లెక్కించారు. పర్యవేక్షణాధికారిగా పాతగుంటూరు శ్రీ అగస్తేశ్వరస్వామి ఆలయ ఈఓ ఎస్ఎల్‌టీ సౌమ్య విచ్చేశారు. కళ్యాణమండపంలో లెక్కింపు కార్యక్రమం చేపట్టారు. 46 రోజులకు గాను రూ.56,14,083 వచ్చాయి. అన్నప్రసాద వితరణ హాల్‌లోని హుండీ ద్వారా రూ.3,36,386 సమకూరింది. బంగారం 30.90 గ్రాములు, వెండి 259 గ్రాములు, విదేశీ కరెన్సీ 55 డాలర్లు వచ్చాయి. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పులిచింతల ప్రాజెక్టును సందర్శించిన ఎస్పీ



అచ్చంపేట: ఆంధ్రా, తెలంగాణ సరిహద్దులోని పులిచింతల ప్రాజెక్టును పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు శుక్రవారం సందర్శించారు. ప్రాజెక్టు వద్ద భద్రతా చర్యలు పర్యవేక్షించారు. ఇంజనీర్ల నుంచి వివరాలు సేకరించారు. రెండు రోజుల కిందట ఆక్టోపస్ టీమ్ ప్రాజెక్టు వద్ద మాక్ డ్రిల్ నిర్వహించింది. తీవ్రవాదుల నుంచి ప్రాజెక్టు రక్షణ, ప్రభుత్వ ఆస్తుల సంరక్షణపై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ నేపథ్యంలో స్వయంగా జిల్లా ఎస్పీ ప్రాజెక్టును సందర్శించి అక్కడి సిబ్బందితో మాట్లాడటం, పలు సూచనలివ్వడం ప్రాధాన్యతను సంతరించుకుంది. అనంతరం ఎస్పీ అచ్చంపేట పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఆయన వెంట అచ్చంపేట సీఐ వెంకటప్రసాద్ ఉన్నారు.

మాత్ర వికటించి చిన్నారి మృతి



బల్లికురవ: బతుకుదెరువుకు రాష్ట్రాలు దాటి వలస వచ్చిన కుటుంబంలో ఆడుతూ పాడుతూ తిరుగుతున్న చిన్నారికి కడుపునొప్పి రావటంతో స్థానిక ఆరోగ్య కార్యకర్త ఇచ్చిన మాత్ర వేయగానే అది వికటించటంతో వైద్యం అందేలోపు చనిపోయింది. కర్ణాటక రాష్ట్రం నుంచి మంగేస్, రంజిత దంపతులు 20 ఏళ్ల కిందట బాపట్ల జిల్లా బల్లికురవ మండలం ఈర్లకొండ క్వారీలో పనిచేసేందుకు వలస వచ్చారు. కొత్తమల్లాయపాలెంలో నివాసం ఉంటున్నారు. వీరికి డింపుల్ అనే ఐదేళ్ల బాలిక ఉంది. గురువారం కడుపునొప్పిగా ఉండటంతో స్థానిక ఆరోగ్య కార్యకర్తలను కుటుంబ సభ్యులు సంప్రదించగా మందు బిళ్ల ఇచ్చారు. ఆ మాత్ర వేసుకున్న కొద్దిసేపటికే ఆరోగ్యం విషమించింది. తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం చిలకలూరిపేటలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ వైద్యుడి సూచన మేరకు మెరుగైన చికిత్సకు గుంటూరు తరలిస్తుండగా మార్గమధ్యంలో గురువారం రాత్రి చనిపోయింది.

ఇంటర్ చదివి ఖాళీగా ఉంటున్న క్రోసూరు మండలం యర్రపాలేనికి చెందిన అనిల్‌కుమార్‌కు తునికి చెందిన హరీష్‌తో పరిచయమైంది. తాను ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికాడు. ఝార్ఖండ్ రాష్ట్రం ధన్‌బాద్ సీఆర్‌పీఎఫ్ క్యాంప్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని ఆశ చూపాడు. అనిల్‌ను ఝార్ఖండ్‌కు కూడా తీసుకెళ్లాడు. అధికారులకు లంచం ఇవ్వాలని చెప్పి రూ.7 లక్షలు తీసుకున్నాడు. ఉద్యోగం గురించి అడిగితే అదిగో ఇదిగో ! అంటూ కాలయాపన చేస్తున్నాడు. విసిగిపోయిన అనిల్ ఉద్యోగం ఇప్పించలేకపోతే తాను చెల్లించిన రూ.7 లక్షలు అయినా ఇవ్వమని కోరినా ఫలితం లేదు. దీంతో ఈ ఏడాది నవంబర్ 25న పల్నాడు జిల్లా ఎస్పీ కార్యాలయానికి వచ్చి ప్రజావేదికలో ఫిర్యాదు చేశాడు. ఇలా దళారుల మాటలు నమ్మి మోసపోయిన యువకులు, తల్లిదండ్రుల సంఖ్య జిల్లాలో భారీగా ఉంది. ప్రతి సోమవారం గ్రీవెన్స్‌లో సరాసరి ఇలాంటి కేసులు రెండు, మూడు వస్తున్నాయంటే మోసాల తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.

కొలువుల పేరుతో మస్కా

- మాయలో పడి రూ.లక్షలు పోగొట్టుకుంటున్న యువత, తల్లిదండ్రులు
- గ్రామీణులతో పాటు పట్టణవాసులు, చదువుకున్న వారూ బాధితులే..
- ఎస్పీ కార్యాలయ గ్రీవెన్స్‌కు పెరుగుతున్న కేసులు
- దళారులను నమ్మి మోసపోవద్దంటున్న పోలీసులు



ఉద్యోగాలు ఇప్పిస్తామని దళారుల మోసాలు

సాక్షి, నరసరావుపేట: నిరుద్యోగులే వారి టార్గెట్. సర్కారు కొలువు భాగ్యం కల్పిస్తామని ఆశ చూపుతారు. దేశ విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని వల వేస్తారు. నమ్మించి లక్షలాది రూపాయలు వసూలు చేస్తారు. అదిగో ఉద్యోగం.. ఇదిగో పోస్టింగ్ ఆర్డర్ ! అంటూ కాలయాపన చేస్తారు. తీరా చూస్తే ఉద్యోగం రాదు. చెల్లించిన డబ్బు కూడా వాపసు ఇవ్వకపోవడంతో దారుణంగా మోసపోయామని గ్రహించిన బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. అయితే, ఆధారాలు లేకుండా, ముక్కూ మొహం తెలియని వారిని నమ్మి మోసపోయి కేసులు నమోదు చేసినా పెద్దగా ఉపయోగం లేకుండా పోతోంది. డబ్బులకు ఉద్యోగాలు వస్తాయా? అని ఒక్కసారి యువత వివేకంగా ఆలోచిస్తే ఈ మోసాల బారిన పడకుండా ఉండే అవకాశముంది. కష్టపడి చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తేనే వస్తాయి. ఉద్యోగాలు పొందడటానికి ఎటువంటి షార్ట్‌కట్స్ ఉండవు. ఈ విషయాన్ని యువత, తల్లిదండ్రులు గ్రహిస్తే దళారుల బారిన పడకుండా ఉండొచ్చు.

గ్రామీణులే టార్గెట్

ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మోసం చేసిన ఘటనలు అత్యధికంగా గ్రామీణ ప్రాంతాల్లో వెలుగులోకి వస్తున్నాయి. ఎస్పీ కార్యాలయానికి వస్తున్న వారు అత్యధికంగా బొల్లాపల్లి, ఈపూరు, క్రోసూరు, వెల్దుర్తి లాంటి మండలాల నుంచే ఉంటున్నారనే అభిప్రాయం పోలీసుల నుంచి వ్యక్తమవుతోంది. ముఖ్యంగా ఆయా మండలాల్లో గిరిజన యువకులకు లక్ష్యంగా చేసుకొని అక్రమార్కులు ఈ మోసాలకు పాల్పడుతున్నారు. పిల్లల భవిష్యత్తు కోసమంటూ పొలాలు, బంగారు తాకట్టుపెట్టి, అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి తల్లిదండ్రులు కూడా ముట్టచెబుతున్నారు. కేవలం గ్రామీణులే కాదు పట్టణ వాసులు, చదువుకున్న వారు సైతం మోసగాళ్ల బారిన పడుతున్నారు. ముఖ్యంగా వీరు విదేశాల్లో ఉద్యోగాలు పేరుతో బురిడీ పడుతున్నారు. ఫారిన్ కన్సల్టేషన్స్ పేరుతో కార్యాలయాలు పెట్టి మోసం చేసి రాత్రి రాత్రికే ఉడాయిస్తున్నారు. ఉద్యోగాల పేరుతో మోసపోయిన వారు పరువుపోయి చులకన అవుతామన్న భావనతో పోలీస్‌స్టేషన్‌లలో ఫిర్యాదులకు సైతం వెనుకాడుతున్నారు. దీన్ని ఆసరాగా తీసుకొని మోసగాళ్లు మరింత రెచ్చిపోతున్నారు.

ఎస్పీ కార్యాలయానికి ఇటీవల వచ్చిన ఫిర్యాదులు

- బొల్లాపల్లి మండలం గండిగనుమల తండాకు చెందిన వాంకడావత్ భోజ్యానాయక్ ఈ ఏడాది నవంబర్ 11న ఎస్పీ కార్యాలయంలో గ్రీవెన్స్‌కు వచ్చి ఫిర్యాదు చేశాడు. తనకు పీఈటీ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి దుర్గారావు అనే వ్యక్తి రూ.2.లక్షలు తీసుకొని మోసం చేశాడని, తనకు న్యాయం చేయాలని వాపోయాడు. మరో ఇద్దరిని కూడా దుర్గారావు మోసం చేశాడని తెలిపాడు.
- నరసరావుపేట ఆర్డీఓ కార్యాలయంలో ఉద్యోగం ఇప్పిస్తానని నందకిశోర్ తనను మోసం చేశాడని పట్టణానికి చెందిన వెంకటరామిరెడ్డి నవంబర్ 4న ఫిర్యాదు చేశాడు. విడతల వారీగా తన వద్ద రూ.1.5 లక్షలు తీసుకున్నట్లు పేర్కొన్నాడు. ఉద్యోగం ఇప్పించకపోగా డబ్బులు వెనక్కి ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు.
- అదే రోజు రెంటచింతల మండలం ఎర్రబాలెం గ్రామానికి చెందిన షేక్ మస్తాన్ డీజీపీ కార్యాలయంలో ఉద్యోగం ఇప్పిస్తానని లోకేష్‌రెడ్డి మోసం చేశాడని ఫిర్యాదు చేశాడు. ఎస్ఐగా పరిచయం చేసుకున్న లోకేష్‌రెడ్డి నకిలీ పత్రాలు సృష్టించి రూ.25 లక్షలు లంచం తీసుకున్నాడని వాపోయాడు. డబ్బు ఇవ్వకుండా అజ్ఞాతంలోకి జారుకున్నాడని, ఆచూకీ వెతికి తన డబ్బులు ఇప్పించాలని కోరాడు.
- భార్యకు ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి పవన్ రూ.3.5లక్షలు తీసుకున్నాడని బొల్లాపల్లి మండలం గండిగనుమలకు చెందిన కేతావత్ సూర్యనాయక్ నవంబర్ 18న ఫిర్యాదు చేశాడు. ఉద్యోగం ఇప్పించపోగా, డబ్బులు అడిగితే బెదిరింపులకు దిగుతున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు.
- గురజాలకు చెందిన బత్తుల శ్రీనివాసరాజు అదే ఊరికి చెందిన మల్లికార్జునరావుకు ఎస్ఐ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ.16 లక్షలు తీసుకొని మోసం చేశాడని నవంబర్ 18న ఫిర్యాదు చేశాడు. డబ్బులు ఇవ్వడానికి తల్లి బంగారాన్ని మొత్తం అమ్మేశానని ఆ యువకుడు ఆవేదన వ్యక్తం చేశాడు.



ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదులను పరిశీలిస్తున్న ఎస్పీ

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

- రెవెన్యూ సదస్సులో కలెక్టర్ అరుణ్‌బాబు
- ప్రతి అర్జీకి రశీదు ఇవ్వాలని ఆదేశం



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

గోళ్ళపాడు(ముప్పాళ్ల): రైతులు, పేదలు భూ వివాద సమస్యలతో చితికిపోతున్నారని, వాటిని పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసిందని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు చెప్పారు. మండలంలోని గోళ్లపాడులో రెవెన్యూ గ్రామ సదస్సును శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుటుంబ వివాదాల కారణంగా భూ సమస్యలు అపరిష్కృతంగా నిలిచిపోతున్నాయని, వాటిని సరి చేసుకుంటే అర్జీల పరిష్కారం సులభతరం అవుతుందని తెలిపారు. కోర్టు కేసులు, ఇతర వివాదాల్లేని ప్రతి అర్జీని, సమస్యను పరిష్కరించడానికి రెవెన్యూ అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని ఆయన సూచించారు. ఏళ్ల తరబడి చిన్నచిన్న కారణాలతో ఉన్న భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు వేదిక కావాలని తెలిపారు. గ్రామసభలో వచ్చిన ప్రతి అర్జీకి రశీదు ఇచ్చి నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. తహసీల్దార్ ఎం.భవానీశంకర్, సర్పంచ్ గోపు అప్పమ్మ, ఎంపీడీవో పి.జె.విలియమ్స్, ఎంపీటీసీ మేడా వెంకటరమణ, డెప్యూటీ తహసీల్దార్ సీహెచ్.లక్ష్మీప్రసాద్, మండల సర్వేయర్ సుధాకర్, ఆయా శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

- మహిళ మృతి
- డ్రైవర్ సహా ఎనిమిది మందికి గాయాలు



మహిళ మృతదేహాన్ని తరలిస్తున్న పోలీసులు

రొంపిచర్ల: వేగంగా వెళుతున్న ట్రావెల్స్ బస్సు అదుపుతప్పి ఆగి ఉన్న లారీని ఢీకొన్న సంఘటన శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి ఎక్స్‌ప్రెస్ వేపై మండలంలో సుబ్బయ్యపాలెం గ్రామ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఈ సంఘటనలో మహిళ మృతి చెందగా, డ్రైవర్ సహా ఎనిమిది మందికి స్వల్ప గాయాలు అయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. హైదరాబాద్ నుంచి కందుకూరు వైపు వెళుతున్న ట్రావెల్స్ బస్సు మండలంలో సుబ్బయ్యపాలెం సమీపంలో గల సత్తాయి కుంట దగ్గరకు రాగానే అదుపుతప్పింది. రోడ్డు మీద ఆగి ఉన్న లారీని ఢీకొంది. ఈ సంఘటనలో బస్సు ముందు సీటులో కూర్చున్న పుట్టపోలు దుర్గమ్మ (56)కు తీవ్ర గాయాలు కావడంతో అక్కడక్కడే మృతి చెందింది. మృతురాలు నెల్లూరు జిల్లా లింగసముద్రం మండలం పెద పావని గ్రామవాసి. సమాచారం తెలుసుకున్న జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహానికి పోస్టుమార్టం చేసేందుకు, బాధితులకు చికిత్స నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు.



సంఘటనా స్థలంలో పరిస్థితి సమీక్షిస్తున్న అధికారులు

మద్దతు ధరకోసం మిర్చి రైతుల ఆందోళన

- నామ్ రహదారిపై బైటాయించిన రైతులు
- దళారులు మోసగిస్తున్నారని రైతుల ఆవేదన
- ట్రాఫిక్ క్లియర్ చేసిన పోలీసులు



నామ్ రహదారిపై రాస్తారోకో నిర్వహిస్తున్న రైతులు

సంతమాగులూరు (అద్దంకి రూరల్): ఆరుగాలం కష్టించి పండించిన పంటను తక్కువ ధరకు దళారులు గద్దల్లా తన్నుకు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ మిర్చి రైతులు రాస్తారోకో చేశారు. సంతమాగులూరు మండలంలోని కొమ్మాలపాడు మిర్చి, పత్తి రైతులు శుక్రవారం రాత్రి నామ్ రహదారిపై గిట్టుబాటు ధర కల్పించాలని నినాదాలు చేస్తూ వాహనాల రాకపోకలు స్తంభింపచేశారు. రైతు నాయకులు, సీపీఐ మండల కార్యదర్శి ఖాదర్ బాషా మాట్లాడుతూ మండలంలోని కొమ్మాలపాడులో సుమారు 400 ఎకరాల వరకు రైతులు పచ్చిమిర్చి పండిస్తున్నారు. పంటను కొనుగోలు చేసేందుకు వచ్చే దళారులు పది కిలోల మిర్చి రూ.300 వరకు రేటు పలుకుతుంటే దళారులంతా సిండికేట్‌గా ఏర్పడి ధర రాకుండా అడ్డుతగులుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పది కిలోల మిర్చి రూ.100 లేక రూ.120 కొనుగోలు చేసి మోసగిస్తున్నారన్నారు. ఇంత మోసం జరుగుతున్నా మార్కెటింగ్ శాఖ, ప్రభుత్వ అధికారులు కాని కన్నెత్తి చూడటం లేదని వాపోయారు. ఎరువుల దుకాణ డీలర్లు, దళారులు కుమ్మక్కై ధర రాకుండా చేస్తున్నారని, ప్రభుత్వం జోక్యం చేసుకుని మద్దతు ధర కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ట్రాఫిక్ నిలిచిపోవటంతో ఎస్ఐ సిబ్బంది అక్కడకు చేరుకుని నియంత్రించారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే రైతు సంఘాలు, ప్రజలను కూడగట్టుకొని మరింత ఆందోళన చేస్తామని ఖాదర్ బాషా హెచ్చరించారు.



రహదారిపై నిలిచిన వాహనాలు

ఎస్సీలపై పెరిగిన వేధింపులు, దాడులు

- అంబేడ్కర్‌కు నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, నాయకులు
- అంబేడ్కర్ సాక్షిగా కూటమి నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపు

నరసరావుపేట: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ సాక్షిగా రాష్ట్రంలో ఎస్సీలపై వేధింపులు, దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. భారతరత్న డాక్టర్ అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం గడియార స్తంభం సెంటర్‌లోని విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ అంబేడ్కర్ దేశానికి చేసిన ఎనలేని సేవలను ప్రతి ఒక్క భారత పౌరుడు గుర్తుంచుకోవాలని అన్నారు. బడుగు, బలహీన వర్గాలకు సమాన అవకాశాలు కల్పించాలని, అన్ని వర్గాల ప్రజలు సమానంగా కలిసిమెలిసి జీవించాలని రాజ్యాంగం ద్వారా ఆయన కోరుకున్నారని తెలిపారు. దేశంలో 17 డిగ్రీలు పొందిన ప్రపంచ గొప్ప మేధావి అని, ఆయన భారతీయుడు అయినందుకు ప్రతి ఒక్కరూ గర్వపడాలని సూచించారు.

ప్రభుత్వతీరు బాధాకరం

ఆయన వర్ధంతి రోజున ప్రస్తుత ప్రభుత్వ పరిపాలన తీరు పరిశీలిస్తే చాలా బాధాకరంగా ఉందన్నారు. ప్రభుత్వం వచ్చిన ఏడు నెలల్లో ఎస్సీ, ఎస్టీ వర్గాల మీద, ముఖ్యంగా ఎస్సీ వర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులపై ఎన్నో కేసులు పెట్టి హింసిస్తున్నారని వెల్లడించారు. మాజీ ఎంపీ నందిగం సురేష్‌పై మూడేళ్ల క్రితం జరిగిన ఒక హత్యలో ప్రమేయం ఉందంటూ అరెస్టు చేయడంతో పాటు పలు కేసుల్లో ఇరికించి నానా చిత్ర హింసలు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావు, ఆయన సోదరుడు మదన్‌మోహనరావులపై ఎప్పుడో రెండేళ్ల క్రితం నందిగామలో చంద్రబాబు నాయుడు మీద రాళ్లు వేసిన కేసులో, వాళ్లకు సంబంధం లేకపోయినా అన్యాయంగా ఇరికించి హత్యాయత్నం కేసు పెట్టి ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. కోర్టు సైతం ఈ కేసును కొట్టి వేసిందన్నారు. యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ పేకాట స్థావరాలను పట్టిస్తున్నాడనే కక్షతో ఆయన మీద ఏడు కేసులు ఫైల్ చేశారని తెలిపారు. మంత్రి మాజీ మంత్రి పినిపె విశ్వరూప్ కుమారుడిపై మూడేళ్ల క్రితం ఎవరో చనిపోతే, ఇప్పుడు ఆ కేసు అతని మీద పెట్టాలని చూస్తున్నారని చెప్పారు. ఎస్సీ వర్గానికి చెందిన నిజాయతీపరులైన పోలీస్ అధికారులు కె.విజయపాల్, సంజయ్‌లపై వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతో అంట కాగారనే నెపం వేసి వారి మీద కేసులు పెట్టారని తెలిపారు. పోలీసులకు మనోధైర్యం ఇవ్వాల్సిన ఈ ప్రభుత్వమే వారి మీద కేసులు పెట్టి వారి మనోధైర్యాన్ని దెబ్బతీస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం వచ్చి ఏడు నెలలైనా సూపర్ సిక్స్ పథకాల ఊసేలేదని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలపై ప్రజల్ని దృష్టి మళ్లించడానికే ఈ రకంగా అక్రమంగా కేసులు పెట్టి హింసిస్తున్నారని ధ్వజమెత్తారు. విజయసాయిరెడ్డిపై 17 కేసులు పెట్టి లుక్ అవుట్ నోటీసులు కూడా జారీ చేశారని తెలిపారు. ముదిరాజు, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్లు ఇయం స్వామి, కందుల ఎజ్రా, పాలపర్తి వెంకటేశ్వరరావు, ఎస్సీ నాయకులు గంటనపాటి గాబ్రియల్, కుక్కల పౌలు, పంగులూరు విజయకుమార్, గుంటి ప్రశాంత్, తంగిరాల రాజా, భూదాల కళ్యాణ్, జమ్ముల రాధా, సయ్యద్ ఖాదర్ బాషా, సయ్యద్ జాఫర్, మైలేరు మార్కు, గౌస్ పీరా, పి.చిన్ని, వరవకట్ట బుజ్జి, వేణు, శివరాత్రి అశోక్ , బండి వెంకటేశ్వరరెడ్డి, మొగిలి ఆంజనేయులు, నేలటూరి సురేష్, బాలు, షేక్ సిలార్ భాష, తిప్పరయ్య పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న డాక్టర్ గోపిరెడ్డి

మనిషిని ప్రేమించేలా రాజ్యాంగం రాసిన అంబేడ్కర్

కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన డాక్టర్ కత్తి పద్మారావు

తెనాలి: దళితులకు మాట్లాడే స్వేచ్ఛ, సమానత్వం సహా మనిషిని మనిషిగా ప్రేమించే రాజ్యాంగాన్ని నిర్మించిన మహోన్నతుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని దళిత ఉద్యమ నిర్మాత, ప్రసిద్ధ కవి, రచయిత డాక్టర్ కత్తి పద్మారావు అన్నారు. దళితులకు రాజ్యాధికారమే అంతిమ లక్ష్యమని అంబేడ్కర్ చాటారని తెలిపారు. పట్టణ చినరావూరుతోటలోని మదర్ థెరిస్సా నగర్‌లో అంబేడ్కర్ యూత్, విగ్రహ నిర్మాణ కమిటీ, సంఘ పెద్దల ఆధ్వర్యంలో నియోజకవర్గంలోనే తొలిగా ఏర్పాటు చేసిన తొమ్మిది అడుగుల అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని శుక్రవారం రాత్రి డాక్టర్ కత్తి పద్మారావు ఆవిష్కరించారు. అనంతర సభకు కనపర్తి అబ్రహాం లింకన్ అధ్యక్షత వహించారు. డాక్టర్ పద్మారావు రచించిన 91వ పుస్తకం 'మన దేశం- మన రాజ్యాంగం' పుస్తకాన్ని పిల్లి విద్యాసాగర్, 'భారతదేశ చరిత్ర'ను మండే నాగేశ్వరరావు ఆవిష్కరించారు. సభలో డాక్టర్ పద్మారావు మాట్లాడుతూ.. అంబేడ్కర్ కన్నుమూశాక 68 ఏళ్లకు ఆయన కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు. శూద్రులు సహా అణగారిన వర్గాల వారిని ఉన్నత వ్యక్తులుగా తీర్చిదిద్దేందుకు డాక్టర్ అంబేడ్కర్ శపథం చేసి మరీ సాధించారని అన్నారు. ఆయన ప్రసాదించిన రాజ్యాంగంతో నేడెందరో సమాజంలో ఉన్నతస్థాయిలో ఉన్నారని గుర్తుచేశారు. స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సమానత్వం వంటి హక్కులను ప్రసాదించినట్టు చెప్పారు. అంబేడ్కర్ మార్గదర్శకత్వంలో కారంచేడు, చుండూరు ఉద్యమాలతో ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ చట్టాన్ని తీసుకురాగలినట్టు చెప్పారు. ఆయన ప్రసాదించిన కలం, పుస్తకం ఆయుధంగా ఈ రోజున సివిల్స్‌కు తయారవుతున్నవారిలో 65 శాతంపైగా ఎస్సీ, ఎస్టీ, బీసీలే ఉండటం చారిత్రక మార్పుగా చెప్పారు. రాజాధికారమే అంతిమ లక్ష్యంగా కృషి చేయాలని సూచించారు.



డాక్టర్ పద్మారావు రచనను ఆవిష్కరించిన పిల్లి విద్యాసాగర్

'అంబేడ్కర్ సూర్యుడు' బిరుదు ప్రదానం

సభలో డాక్టర్ కత్తి పద్మారావును సత్కరించి 'అంబేడ్కర్ సూర్యుడు' బిరుదును ప్రదానం చేశారు. తొలుత స్థానిక జేఎంజే మహిళా కాలేజీ నుంచి భారీ బైక్ ర్యాలీతో డాక్టర్ పద్మారావును సభాస్థలికి తోడ్కొనివచ్చారు. మన్నవ ప్రభాకర్ స్వాగతం పలికారు. వాసిమళ్ల శ్యామ్ సభాపరిచయం చేశారు. మన్నవ శాంతిశ్రీ, దాసరి వీరవసంతరావు, అక్కిదాసు కిరణ్, కంచర్ల ఆనంద్, కారుమంచి రవికుమార్, బేతాళ ప్రభాకర్, పిల్లి గంగాధర్, బేతాళ భూషణం, కనపర్తి అనిల్, మేకతోటి ప్రభాకరరావు, కన్నెగంటి రమేష్‌బాబు, బోరుగడ్డ సురేష్, పీసీహెచ్ వెంకయ్య, గొల్లా మాణిక్యరావు, గారపాటి బాలస్వామి, కర్రా రాజారత్నం, మేరుగ సంజీవరావు, నీలా విజయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. విగ్రహావిష్కరలో మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ కూడా పాల్గొని, అంబేడ్కర్‌కు పుష్పాంజలి ఘటించారు.

క్లుప్తంగా

కత్తెర పురుగుతో మొక్కజొన్నకు తీవ్ర నష్టం

డీఏవో మురళి



నరసరావుపేట రూరల్: కత్తెర పురుగు ఉధృతితో మొక్కజొన్న పంటకు తీవ్ర నష్టం జరుగుతుందని జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి తెలిపారు. మండలంలోని దొండపాడులో శుక్రవారం ఆయన పర్యటించారు. మొక్కజొన్న పంటలను పరిశీలించి, కత్తెర పురుగు ఉనికిని గుర్తించారు. లక్షణాలు, నివారణ చర్యలను రైతులకు తెలియజేశారు. గొంగళి పురుగు ముఖంపై తిరగబడిన వీ ఆకారంలో తెల్లని చారలను కలిగి ఉంటుందని తెలిపారు. గొంగళి పురుగు ఉదర భాగంలో ఆఖరి ఖండితంపై నల్లటి నాలుగు చుక్కలు చతురస్రాకారంలో ఉంటాయని వివరించారు. మొదటి దశలో ఆకులకు రంధ్రాలు చేస్తుందని, అవి నిలువుగా కనిపిస్తాయని తెలిపారు. పురుగు పెరిగే కొద్దీ ఆకుల చివరల నుంచి తింటూ కత్తిరించినట్టుగా ఉంటూ పూర్తిగా తినేస్తాయని వివరించారు. దుక్కులు లోతుగా దున్నుకోవడం వల్ల పురుగు నిద్రావస్థ, కోశస్థ దశలో నాశనం అవుతాయని సూచించారు. పంట చుట్టూ నాలుగు వరుసలు నేపియర్ గడ్డిని ఎరపంటగా వేసుకోవాలని తెలిపారు. ఐదు లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకుని పురుగు ఉధృతిని గమనించాలని సూచించారు. నివారణకు 500 మి.లీ. క్లోరిపైరీఫాస్ లేదా 400 మి.లీ. క్వినాల్ ఫాస్‌ను మందును పిచికారీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏ నరేంద్రంబాబు, రైతులు పాల్గొన్నారు.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

మేదరమెట్ల: బతుకుదెరువు కోసం వచ్చిన మహిళ కుటుంబ కలహాలతో ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన శుక్రవారం కొరిశపాడు మండలం మేదరమెట్ల-అద్దంకి రోడ్డులోగల మసీదు సమీపంలో చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. బీహార్ రాష్ట్రానికి చెందిన మహ్మద్ సలీమా ఖాతుమ్ (28) తన భర్త వసీమ్‌తో కలసి పదేళ్లగా మేదరమెట్లలో ఉంటున్నారు. భర్త గ్రానైట్ ఫ్యాక్టరీలో పనిచేస్తుంటాడు. ఇటీవల కాలంలో భార్యాభర్తల మధ్య ఏం జరిగిందో తెలియదు కానీ భర్త కోల్‌కతా వెళ్లిపోయాడు. శుక్రవారం ఉదయం ఖాతూమ్ ఇంట్లో ఫ్యానుకు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. దీన్ని గమనించిన ఇరుగుపొరుగు వారు మేదరమెట్ల పోలీసులకు సమాచారం అందజేశారు. అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి మృతురాలి భర్తకు ఫోన్ సమాచారం అందజేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఉదయం భర్తతో ఫోన్‌లో మాట్లాడిన తరువాతే ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. మృతురాలికి నాలుగేళ్ల పాప ఉంది.

సంక్షేమ హాస్టళ్లలో వసతుల కల్పనే లక్ష్యం

కలెక్టర్ పి.అరుణ్‌బాబు

నరసరావుపేట: రానున్న రోజుల్లో జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లలో వసతులను మెరుగుపరచడంలో నిమగ్నమవ్వాలని సంక్షేమ శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా బాలికల హాస్టళ్లపై దృష్టి సారించాలని తెలిపారు. వసతి గృహాల్లో అత్యవసరమైన వసతులను కల్పించేందుకు, వాటి మరమ్మతులకు అవసరమయ్యే ఖర్చుల వివరాలను అందించాలని ఆదేశించారు. జిల్లాలో వంద రోజుల ప్రణాళిక పురోగతి నివేదికలు శనివారానికి సమర్పించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. డిసెంబరు 11, 12 తేదీల్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లా కలెక్టర్ల సమావేశం నిర్వహించనున్నారని వెల్లడించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇసుక పాలసీ, పింఛన్ పంపిణీ, మద్యం పాలసీ, అన్న క్యాంటీన్లు, సాగునీటి పథకాలు, రెవెన్యూ సదస్సులు, పీజీఆర్ఎస్, రోడ్ల మరమ్మతులు తదితర అంశాలకు సంబంధించిన వివరాలు వెంటనే అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే, సీపీవో జి.శ్రీనివాస్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సాయుధ బలగాల విరాళాల సేకరణ ప్రారంభిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, అధికారులు

లాంఛనంగా విరాళాల సేకరణ ప్రారంభం

సాయుధ బలగాల పతాక దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం కలెక్టరేట్‌లో విరాళాల సేకరణను జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు లాంఛనంగా ప్రారంభించారు.తొలుత ఆయన విరాళాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమాధికారి గుణశీల, అధికారులు పాల్గొన్నారు.

నిస్వార్థ సేవకులు హోంగార్డులు

వ్యవస్థాపక దినోత్సవంలో జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు



హోంగార్డు ఆర్ఐ కృష్ణకు షీల్డు అందజేస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు, అదనపు ఎస్పీ, ఏఆర్ డీఎస్పీలు

నరసరావుపేట: హోంగార్డులు నిస్వార్థ సేవకులని, సమాజ శ్రేయస్సు, ప్రజారక్షణ కోసం వారు అందిస్తున్న అత్యుత్తమ సేవలు అభినందనీయమని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పేర్కొన్నారు. హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం కోడెల శివప్రసాదరావు స్టేడియం(డీఎస్ఏ)లో నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏఆర్ అదనపు ఎస్పీ వి.సత్యరాజు, ఏఆర్ డీఎస్పీ జి.మహాత్మాగాంధీరెడ్డి, హోంగార్డు ఆర్ఐ కృష్ణ పర్యవేక్షణలో హోంగార్డు పి.సుధాకర్ పరేడ్ కమాండర్‌గా కవాతును నిర్వహించారు. మార్చ్ ఫాస్ట్ నిర్వహించి, ప్లటూన్ వారీగా జిల్లా అధికారి ఎస్పీకి గౌరవ వందనం సమర్పించారు. హోంగార్డులకు నిర్వహించిన 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు, షాట్ పుట్, లాంగ్ జంప్ తదితర పోటీల్లో విజేతలైన వారికి బహుమతులు ప్రదానం చేశారు. విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన హోంగార్డులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితులు, సంఘ విద్రోహశక్తుల అణచివేత, ప్రకృతి వైపరీత్యాలు వంటివి సంభవించినప్పుడు పోలీస్ బలగాలతో సమానంగా హోంగార్డులు సేవలందిస్తున్నట్లు తెలిపారు. వారి సేవలు వెలకట్టలేనివి, భవిష్యత్తులో కూడా మరిన్ని మెరుగైన సేవలు ప్రజలకు అందించి పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆయన సూచించారు. 1962 చైనా యుద్ధ సమయంలో భారతీయ సైన్యానికి అద్భుతమైన సేవలు అందజేసినప్పటి నుంచి వీరిని పోలీస్ శాఖకు సహాయకులుగా నియమించారని వెల్లడించారు. ఆర్గనైజేషన్ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు ప్రభుత్వం హోంగార్డు వ్యవస్థ కోసం ఎన్నో సంక్షేమ చర్యలు తీసుకుందని తెలిపారు. ఉన్నతాధికారులు కూడా ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకుని ఎప్పటికప్పుడు హోంగార్డులకు సంక్షేమాన్ని మెరుగుపర్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని, దీనికి తనవంతు సహకారం అందజేస్తానని ఎస్పీ ప్రకటించారు. హోంగార్డ్స్ కుటుంబాలకు ఇబ్బందులు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. హోంగార్డుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకుంటున్నామని, పూర్తి హెల్త్ చెకప్‌కు ప్లాన్ చేస్తున్నట్లు ఎస్పీ ప్రకటించారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కేవీడీ రామారావు ఎస్పీ సీఐ బండారు సురేష్‌బాబు, వెల్ఫేర్, అడ్మిన్ ఆర్ఐలు గోపీనాథ్, రాజా, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి

నరసరావుపేట: భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 68వ వర్ధంతిని జిల్లా పోలీసు అధికారులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా అదనపు ఏఆర్ ఎస్పీ వి.సత్తిరాజు ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించి, ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజ్యాంగాన్ని అంబేడ్కర్ అత్యంత ప్రామాణికంగా రచించినట్లు పేర్కొన్నారు. రాజ్యాంగంలో బడుగు, బలహీన వర్గాల వారికి హక్కులను పొందుపరిచి సామాజిక వివక్షతను రూపుమాపే ప్రయత్నం చేశారని వివరించారు. దేశానికి తొలి న్యాయశాఖ మంత్రిగా సేవలను అందించి భారత జాతి నిర్మాణం కోసం పాటుపడ్డారని తెలిపారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కేవీడీ రామారావు, వెల్ఫేర్ ఆర్ఐ గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

స్పా సెంటర్‌లపై పోలీసుల దాడులు

లక్ష్మీపురం: గుంటూరు వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని లక్ష్మీపురంలో ఉన్న ఇంటర్నేషనల్ స్పా సెంటర్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు అడిషనల్ ఎస్పీ సుప్రజ, అరండల్ పేట సీఐ వీరాస్వామి ప్రత్యేక బృందాలుగా శుక్రవారం దాడులు నిర్వహించారు. నలుగురు థాయిలాండ్‌కు చెందిన వారితోపాటు ఏడుగురు మహిళలు, ఇద్దరు పురుషులను అదుపులో తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారిని పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

8న ఎన్ఎంఎంఎస్ పరీక్ష

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వ ఉపకార వేతనాలకు ఎంపిక చేసేందుకు ఉద్దేశించిన జాతీయ ప్రతిభా ఉపకార వేతన (ఎన్ఎంఎంఎస్) పరీక్ష ఆదివారం జరగనుంది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరగనున్న పరీక్షకు గుంటూరులో ఆరు, తెనాలిలో ఐదు చొప్పున కేంద్రాలు ఏర్పాటు చేశారు. 2,056 మంది హాజరు కానున్నారు. జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక శుక్రవారం పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, శాఖాధికారులతో తన కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు.

రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలి



వెల్దుర్తిలో అర్జీదారులతో జేసీ సూరజ్ గనేరే

వెల్దుర్తి: రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనేరే తెలిపారు. ఆయన శుక్రవారం వెల్దుర్తి గ్రామ సచివాలయ ఆవరణలో జరిగిన సదస్సుకు హాజరై మాట్లాడారు. మండలంలో రోజుకొక గ్రామంలో సభ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రెవెన్యూ సిబ్బంది ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఆ గ్రామంలోనే అందుబాటులో ఉంటారన్నారు. భూముల సబ్ డివిజన్, మ్యుటేషన్ కోసం డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. రైతులు వివరాలను రికార్డులలో సరి చూసుకోవాలని, ఏమైనా తేడాలుంటే గ్రామ సభల్లో అక్కడికక్కడే పరిష్కరిస్తామని వివరించారు. శుక్రవారం నిర్వహించిన గ్రామ సభలో 17 అర్జీలు వచ్చాయని, వాటిని ఆన్‌లైన్ చేసి సమస్యలను పరిష్కరిస్తామని జేసీ తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి జగదీష్‌రెడ్డి, తహసీల్దార్ బాషా, ఎంపీడీఓ డి. ప్రసాద్ పాల్గొన్నారు.

పనుల శంకుస్థాపనలో ప్రొటోకాల్‌కు మంగళం

వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులపై వివక్ష



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

ముప్పాళ్ల: గ్రామాలను అభివృద్ధి బాట పట్టిస్తాం.. ప్రజలతో ఎన్నుకోబడిన వారికి తగిన గౌరవం అందిస్తామని కూటమి నేతలు పదేపదే చెబుతుంటారు. మాటలకు, చేతలకు పొంతన లేకుండా పోతోంది. గ్రామంలో అభివృద్ధి పనులు ప్రారంభానికి కనీసం ప్రథమ పౌరుడైన సర్పంచ్, మండల ప్రథమ పౌరురాలైన ఎంపీపీకి ఆహ్వానం లేకుండా పోయింది. వైఎస్సార్ సీపీ తరఫున ఎన్నికల్లో గెలిచారనే అక్కసుతోనే ఆహ్వానం లేదని ప్రజాప్రతినిధులు ఆరోపిస్తున్నారు. మండలంలోని ముప్పాళ్ల, చాగంటివారిపాలెం గ్రామాల పరిధిలో రూ. 1.70 కోట్ల మేర పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్, స్థానిక శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణతో కలిసి శుక్రవారం శిలాఫలకాలను ఆవిష్కరించారు. పనుల శంకుస్థాపనకు ఆయా గ్రామాల సర్పంచ్‌లు మెడబలిమి సతీష్ (ముప్పాళ్ల), పీలా గాయత్రి(చాగంటివారిపాలెం)లతో పాటుగా ఎంపీపీ, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ అయిన మారూరి పద్మకు ఆహ్వానం అందలేదు. ఇవేమీ పట్టించుకోకుండానే మంత్రి శంకుస్థాపన పూర్తి చేశారు. కూటమి పాలనలో ప్రజాప్రతినిధులకు ఇచ్చే గౌరవం ఇదేనా ? అంటూ ప్రశ్నిస్తున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు కూడా ఏమీ తెలియనట్టుగానే వ్యవహరించారు.

పలు అభివృద్ధి పనులకు భూమిపూజ

మండల కేంద్రమైన ముప్పాళ్లలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రూ.50లక్షలతో నూతనంగా నిర్మించనున్న బ్లాక్ ప్రైమరీ హెల్త్ యూనిట్ భవన నిర్మాణానికి, సత్తెనపల్లి-నరసరావుపేట రోడ్డులోని ఉన్న కాలువపై రూ.1.20 కోట్లతో నిర్మించనున్న వంతెన నిర్మాణానికి శుక్రవారం రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, స్థానిక శాసన సభ్యులు కన్నా లక్ష్మీనారాయణ శిలాఫలకం ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ రవి, సత్తెనపల్లి ఆర్డీవో రమణకాంత్‌రెడ్డి, పీహెచ్‌సీ వైద్యులు జయకృష్ణ, రమాదేవి, టీడీపీ నాయకులు బత్తుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ముగిసిన కళా ఉత్సవ్ పోటీలు

- రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన కళాకారులు
- విజేతలను అభినందించిన డీఈవో ఎల్ చంద్రకళ



విజేతలకు సర్టిఫికెట్లను అందజేస్తున్న డైట్ లెక్చరర్ సుభాని

యడ్లపాడు: కళా ఉత్సవ్ 2024–25 జిల్లాస్థాయి పోటీలు ఘనంగా జరిగాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా విద్యాశిక్షణ సంస్థ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. మొత్తం ఆరు విభాగాల్లో ఏర్పాటు చేయగా వాటిలో మూడింటిలో మాత్రమే విద్యార్థులు పాల్గొన్నారు. ప్రధానంగా జానపద గీతాలాపన, సంప్రదాయ నృత్యం, మైమ్‌షో విభాగాల్లో 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జానపదం విభాగంలో మున్నంగి జెడ్పీహైస్కూల్ బృందం, గుంటూరు వెంకటేశ్వర బాలకుటీర్ విద్యాసంస్థలు వరుసగా ప్రథమ, ద్వితీయస్థానాల్లో గెలుపొందాయి. సంప్రదాయ నృత్య విభాగంలో వేల్పూరు జెడ్పీ హైస్కూల్, గుంటూరు వెంకటేశ్వర బాలకుటీర్ విద్యాసంస్థలు ప్రథమ, ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నాయి. మైమ్ షోలో మాత్రం వేలూరు జెడ్పీ హైస్కూల్ ఒక్కటే ప్రథమ స్థానాన్ని గెలుచుకుంది. ఆయా పోటీలకు డైట్ లెక్చరల్ కె. ప్రసాద్, కె. అజయ్‌కుమార్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. విజేతలకు డైట్ కళాశాల సీనియర్ లెక్చరల్ ఎస్ఎం సుభాని బహుమతి ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పల్నాడు జిల్లా డీఈవో ఎల్. చంద్రకళ నేతృత్వంలో నిర్వహించిన ఈ పోటీల్లో విజేతలందరికీ ఆమెతో పాటు అధ్యాపకులు అభినందించారు. బాలబాలికలు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అర్హతను సాధించడం ప్రశంసనీయమన్నారు. ఆయా పోటీల్లోనూ అద్భుత కళా నైపుణ్యాలు ప్రదర్శించి జాతీయ స్థాయి పోటీల్లో స్థానం సంపాదించి, జిల్లాకు మంచి పేరును తీసుకురావాలని ఆకాంక్షించారు.

సాగులో ఏటీఎం విధానంతో నిరంతర ఆదాయం

- ప్రకృతి సాగు విభాగం పల్నాడు జిల్లా డీపీఎం కె. అమలకుమారి
- సంగంగోపాలపురంలో ప్రకృతి పంటల పరిశీలన



సంగంగోపాలపురంలోని ప్రకృతి సాగుని పరిశీలిస్తున్న డీపీఎం కె అమలకుమారి

యడ్లపాడు: సాగులో ఏటీఎం (ఎనీ టైం మనీ) విధానంతో రైతులు నిరంతర ఆదాయం పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ విభాగం పల్నాడు జిల్లా డీపీఎం కె. అమలకుమారి చెప్పారు. యడ్లపాడు మండలాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా సంగంగోపాలపురంలోని రైతు రామకృష్ణ ఏటీఎం మోడల్ ప్రకృతి వ్యవసాయ పంటను పలువురు రైతులతో కలిసి పరిశీలించారు. 40 సెంట్ల విస్తీర్ణంలో అన్ని రకాల ఆకు కూరలు, కూరగాయ పంటల్ని సాగు చేయడాన్ని వివరించారు. రసాయనిక ఎరువులు, పురుగు మందులు వినియోగం లేకుండా మంచి పోషకాల కలిగిన ఉత్పత్తుల్ని పండిస్తున్నట్లు తెలిపారు. స్థానికంగా వాటిని విక్రయిస్తూ ఆదాయాన్ని పొందుతున్నట్లు తెలిపారు. ఈ విధానం సాగుతో అటు నేలకు, ఇటు వినియోగదారులకు అనారోగ్య సమస్యలు వాటిల్లవని వివరించారు. పల్నాడు జిల్లాలో ఈ ఏడాది 39,113 మంది రైతులు 42312 ఎకరాల్లో ప్రకృతి సేద్యం చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌పీ సైదయ్య, అప్పలరాజు, నందకుమార్, మేరి, సౌజన్య, మాస్టర్ ట్రైనర్లు జయలక్ష్మి, మధుబాబు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

రోగి సంతృప్తే ప్రధానం



మాట్లాడుతున్న డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి

గుంటూరు మెడికల్: అత్యంత ప్రాచుర్యం పొందిన మోకీలు మార్పిడి శస్త్ర చికిత్స అనంతరం రోగి సంతృప్తికరంగా ఉండడం అనేది వైద్యుడి ప్రధాన కర్తవ్యం అని ప్రముఖ కీళ్ల మార్పిడి వైద్య నిపుణులు, సాయిభాస్కర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ బూసిరెడ్డి నరేంద్ర రెడ్డి అన్నారు. మోకీలు మార్పిడి శస్త్ర చికిత్స నిర్వహించడం ప్రపంచవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తున్న సమయంలో ఆపరేషన్ తరువాత రోగి అస్థిరత్వానికి గురికాకూడదని తెలిపారు. శుక్రవారం బెంగళూరులో జరిగిన 69 వ ఇండియన్ ఆర్థోపెడిక్ జాతీయ సదస్సు (ఐఓఏకాన్)లో ఇన్‌స్టబిలిటీ ఆఫ్టర్ టీకేఆర్ అనే అంశంపై డాక్టర్ నరేంద్ర రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. దేశ వ్యాప్తంగా ఆరువేల మందికిపైగా ఎముకలు, కీళ్ల వైద్య వైద్యులు సదస్సుకు హాజరయ్యారు. సదస్సులో డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి మాట్లాడుతూ మోకీలు మార్పిడి శస్త్ర చికిత్స తర్వాత అతి కొద్దిమంది మాత్రం తరచూ కొన్ని సమస్యలను వ్యక్తపరుస్తున్నారని వెల్లడించారు. దీనిపై తన పరిశోధన, పరిశీలన సుదీర్ఘకాలం కొనసాగిందని చెప్పారు. మోకీలు మార్పిడిలో ఇంప్లాంట్‌ను అమర్చడం, అవసరం మేరకు ఎముకను కట్ చేయడం అనేది ప్రధాన భూమిక పోషిస్తాయన్నారు. ఈ నేపథ్యంలో వాటి పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. రోగి శరీరతత్వంపై కూడా అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ నరేంద్రరెడ్డి వివరించారు.

ఎన్జీరంగా వర్సిటీలో అంబేడ్కర్‌కు ఘన నివాళులు



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న వీసీ డాక్టర్ ఆర్ శారదజయలక్ష్మిదేవి

గుంటూరు రూరల్: దేశం గర్వించేలా రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ ఆర్ శారదజయలక్ష్మిదేవి తెలిపారు. నగర శివారు లాంఫాం నందున్న విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో అంబేడ్కర్ చిత్రపటానికి వీసీ పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాజ్యాంగంలో హక్కులతోపాటు బాధ్యతలను అందరూ గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు, పీజీ స్టడీస్ డీన్ డాక్టర్ ఏవీ రమణ, కమ్యూనిటీ సైన్స్ డీన్ డాక్టర్ బీ శ్రీలక్ష్మి, పరిశోధన సంచాలకులు డాక్టర్ పీవీ సత్యనారాయణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్ డాక్టర్ డీ సంపత్‌కుమార్, లైబ్రేరియన్ డాక్టర్ పి.సాంబశివరావు, ఎస్టేట్ ఆఫీసర్ పీ రవి తదితరులు పాల్గొన్నారు.

రూ. 3.5 కోట్ల విలువైన ఎర్రచందనం స్వాధీనం

మంగళగిరి: తమిళనాడుకు చెందిన ఇద్దరు నిందితుల నుంచి రూ.3.5 కోట్ల విలువైన ఎర్రచందనం దుంగలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ.. సినీ ఫక్కీలో పేపర్ బండిల్స్‌లో దుంగలు తరలిస్తున్నారనే సమాచారం మేరకు కాజ టోల్‌గేట్ వద్ద తనిఖీలు నిర్వహించి 49 దుంగలు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ రవికుమార్, డీఎస్పీ భార్గవి, రూరల్ సీఐ వై శ్రీనివాసరావు , పట్టణ సీఐ డి వినోద్ కుమార్, రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ళ వెంకట్ సిబ్బంది పాల్గొన్నారు.

హామీల అమలుపై చిత్తశుద్ధి కరువు



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

- ప్రభుత్వాన్ని నిలదీసిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబూరావు
- ఘనంగా పల్నాడు జిల్లా మహాసభ

నరసరావుపేట: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు సీహెచ్.బాబూరావు డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా 25వ జిల్లా మహాసభల సందర్భంగా సత్తెనపల్లి రోడ్డులోని కోట సెంటర్ నుంచి పల్నాడు బస్టాండ్ వరకు నాయకులు, కార్యకర్తలు, విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, ప్రదర్శన నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభకు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్ అధ్యక్షత వహించగా, పలువురు రాష్ట్ర నాయకులు ప్రసంగించారు. బాబూరావు మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తామని, విద్యుత్ చార్జీలను పెంచబోమని, ఉచిత ఇసుక ఇస్తామని ఇచ్చిన హామీలు ఆచరణలో అమలు కావడం లేదని తెలిపారు. వీటితో పాటు సూపర్ సిక్స్, మేనిఫెస్టోలో పేర్కొన్న అంశాల అమలుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కూడా కోరుతున్నారన్నారు. విద్యుత్ చార్జీలను తగ్గిస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎడాపెడా భారం మోపుతోందని విమర్శించారు. ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇవ్వడం కాదని, ప్రతి గ్యాస్ సిలిండర్‌కు రూ.400కి ఇవ్వాలని ఆయన కోరారు. ప్రజలకు నాణ్యమైన మద్యం ఇస్తున్నామని చెబుతున్న చంద్రబాబు తినడానికి నాణ్యమైన రేషన్ బియ్యం ఇస్తామని ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు.రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి.కృష్ణయ్య మాట్లాడుతూ అక్రమ రేషన్ బియ్యం నియంత్రణ పేరుతో కాకినాడ పోర్టులో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సినిమా నటుడుగానే వ్యవహరించారే తప్పా అసలు దోషులపై ఇంత వరకు చర్యలు లేవని తెలిపారు.

జిల్లా మహాసభల ప్రారంభ సూచికగా ప్రజా నాట్యమండలి కళాకారులు టి.పెద్దిరాజు, సుందరయ్య, నాగమ్మ బాయి, జగన్, తోకల కోటేశ్వరరావు ఆలపించిన విప్లవ గేయాలు, విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కోలాటం, డప్పు కళాకారుల ప్రదర్శన, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. పట్టణంలోని ప్రధాన వీధులను ఎర్ర జెండాలతో అలంకరించారు. సీనియర్ నాయకులు గద్దె చలమయ్య, ఏవీకే దుర్గారావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు, వై.రాధాకృష్ణ, జి.రవిబాబు, డి.శివకుమారి, అనుముల లక్ష్మీశ్వర రెడ్డి, ఎస్.ఆంజనేయ నాయక్ పాల్గొన్నారు.

సీఎం పర్యటన విజయవంతం చేయాలి

రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు

బాపట్ల: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరయ్యే తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమావేశంలో ఎలాంటి సమస్యలు రాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు అన్నారు. ముఖ్యమంత్రి సభ జరిగే బాపట్ల మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విజయరామరాజు, సమగ్ర శిక్ష అభియాన్ స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి, జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్‌లతో కలిసి శుక్రవారం పర్యటించారు. హెలిప్యాడ్ నుంచి కాన్వాయ్, ముఖ్యమంత్రి పర్యటన కార్యక్రమంపై ట్రయల్ రన్ నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి హాజరయ్యే సమావేశ వేదిక ఏర్పాట్లను పరిశీలించారు. పాఠశాలకు చేరుకోగానే విద్యార్థులే సంప్రదాయ దుస్తులతో ఆహ్వానం పలికేలా చూడాలన్నారు. విద్యార్థుల ప్రగతి పత్రాలపై తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు చర్చించే తరగతి గదులను ముఖ్యమంత్రి పరిశీలిస్తారని తెలిపారు. ఆ తరగతి గదుల వద్దకు ఎన్‌సీసీ క్యాడెట్లు మార్చ్ ఫాస్ట్ నిర్వహిస్తూ సీఎంను తీసుకుని వెళ్లే కార్యక్రమం ట్రయల్ రన్ పరిశీలించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన జయప్రదం చేయడానికి విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలన్నారు. అధికారులంతా సమగ్ర ప్రణాళికతో కార్యక్రమాన్ని జయప్రదంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.